సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 22 । మే । 2024



గిరి గ్రామాల్లో పెర్సపేన్ పూజలు

వైశాఖమాసం పురస్కరించుకుని ఇంద్రవెల్లి మండల పరిధిలోని గిరి గ్రామాల్లో ఆదివాసీలు మంగళవారం పెర్సపేన్ పూజలు ఘనంగా నిర్వహించారు. 8లో▸



బడిబయట నుంచి గురుకులానికి

బడికి దూరంగా ఉన్న బాలురను అక్కున చేర్చుకుంటుంది జిల్లాకేంద్రంలోని యూఆర్ఎస్. విద్యాబుద్ధులు నేర్పుతూ వారిని గురుకులాల వైపు మళ్లిస్తున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0/29.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీధర్‌స్వామి

బజార్‌హత్నూర్: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అంటగడితే కఠిన చర్యలు తప్పవని సీడ్స్, ఎరువుల దుకాణాదారులను ఏడీఏ శ్రీధర్ స్వామి హెచ్చరించారు. అవసరమైతే దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మండలకేంద్రంలోని పలు విత్తన దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. వారి వెంటఏవో ప్రమోద్‌రెడ్డి, ఏఈవో సంతోష్, నాగభూషణ్, రమణ, ప్రశాంత్, ఆశన్న, గోవర్ధన్, ముత్తన్న పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెట్ అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని వామపక్ష రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి, చిల్క దేవిదాస్, వెంకట నారాయణ, జగన్ సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో దాదాపు 4 లక్షలు ఎకరాల్లో పత్తి పంట సాగు కానున్నట్లు తెలిపారు. సుమారు 10లక్షల వరకు విత్తన ప్యాకెట్లు అవసరముతాయన్నారు. ఈ మేరకు డిమాండ్ రకం విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా అధికారులు స్పందించి రైతుల డిమాండ్ మేరకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సౌజన్య

ఆదిలాబాద్‌రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. మండలంలోని చాందా (టి) గ్రామంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా పలు రకాల సేవలు అందించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండలంలోని కౌట గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కర్ర రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం చేపట్టిన శోభాయాత్రలో ఎమ్మెల్యే అనిల్ జాద పాల్గొన్నారు.

- ఇటీవల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గల ఓ బిర్యానీ హౌస్‌లో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బిర్యానీ పార్శిల్ తీసుకెళ్లాడు. ఇంటికెళ్లి భోజనం చేద్దామని ప్లేట్‌లో వేసుకునే సరికి అందులో నుంచి బొద్దింక కళేబరాలు బయట పడ్డాయి. హోటల్‌కు వెళ్లి యజమానితో మాట్లాడితే పట్టించుకోకపోవడంతో పాటు కస్టమర్‌నే బెదిరించాడు. విషయాన్ని సదరు వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేయగా మరుసటి రోజు హోటల్‌ను తనిఖీ చేశారు. కిచెన్ షెడ్‌లోకి వెళితే అపరిశుభ్రం దర్శనమిచ్చింది. దీంతో యజమానికి రూ.20వేల జరిమానా విధించారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో గల ఓ హోటల్‌లో నుంచి ఓ వ్యక్తి బిర్యానీ పార్శిల్ తీసుకెళ్లాడు. ఇంటికెళ్లి తెరిచి చూడగా అందులో నుంచి ఎలుక మలం దర్శనమిచ్చింది. వెంటనే అక్కడికి చేరుకొని యజమానితో వాగ్వాదానికి దిగాడు. వారు తప్పు జరిగిందని, మరొకటి తీసుకెళ్లాలని సూచించినప్పటికీ ఆ వ్యక్తి తీసుకోకుండా అక్కడినుంచి వెళ్లిపోయాడు. జిల్లా కేంద్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

తింటే.. రోగాలే!



హోటల్‌లోని కిచెన్‌లో ఆహార పదార్థాలు తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)



బిర్యానీలో బొద్దింక ఉన్న దృశ్యం (ఫైల్)

- నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు
- నిల్వ ఉంచిన చికెన్, మాంసంతోనే వంటలు
- నాసిరకం సరుకులు.. కాగిన నూనే మళ్లీ వాడకం
- అనారోగ్యం 'కొని' తెచ్చుకుంటున్న జనం
- ఫిర్యాదు చేస్తేనే అధికారుల తనిఖీలు

ఆదిలాబాద్‌టౌన్: హోటళ్లు, రెస్టారెంట్ల పక్క నుంచి వెళితే బిర్యానీ ఘుమఘుమ లాడిస్తుంటుంది. ఒక్కసారి వెళ్లి తింటే బాగుంటుందనే కోరిక కలగక మానదు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో పేరుకు పెద్దపెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు అయినప్పటికీ మీద మెరుగు.. లోపల మురుగనే చందంగా ఉంది పరిస్థితి. కిచెన్‌లోకి 'నాట్ అలౌడ్' అనే బోర్డు పెట్టి తమ పని కానిచ్చేస్తున్నారు. ఒక్కసారి అందులోకి తొంగిచూస్తే చాలు జీవితంలో అలాంటి ఫుడ్ తినొద్దు అనుకోవడం ఖాయం. కుళ్లిన సరుకులు చూస్తే వాంతి చేసుకోవాల్సిందే. పురుగులు పట్టిన మైదా, పాడైన చింతపండు, నాసిరకం అల్లం వెల్లుల్లి, తదితర వాటితో కిచెన్ కంపు కొడుతుంది. ఒక్కసారి తయారు చేసిన మసాలాలు ఓ గంజిలో వేసి రోజు వేడి చేస్తూ వాటినే కళ్లకు ఇంపుగా డెకరేట్ చేస్తూ వడ్డించడం షరా మామూలే.

వంట గదులు అపరిశుభ్రం..

హోటళ్లు, రెస్టారెంట్లకు సంబంధించి కిచెన్‌లను శుభ్రంగా ఉంచడం లేదు. కుళ్లిన ఆహార పదార్థాలనే వంటలో వినియోగిస్తున్నారు. మసాలాలు గ్రైండింగ్ చేసి వాటిని వారం వరకు ఉపయోగిస్తున్నారు. వాటిపై ఎలాంటి మూత పెట్టకపోవడంతో అందులో పురుగులు, బొద్దింకలు, బల్లులు పడడంతో పాటు ఎలుకలు సైతం సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు మూడు రోజులకు సరిపడా చికెన్, మటన్ ఒకేసారి తీసుకొస్తున్నారు. వాటిని పసుపులో ఉడికించి బిర్యానీలో వాడుతున్నారు. మిగతా వాటిని ఫ్రిజ్‌లో స్టోర్ చేస్తున్నారు. కొన్ని హోటళ్లలో బిర్యానీ చేసిన తర్వాత మిగిలిపోతే అందులోని ముక్కలను తీసి మరుసటి రోజు బిర్యానీలో వేస్తున్నట్లు సమాచారం. ఘుమఘుమ లాడేందుకు అందులో టెస్టింగ్ పౌడర్ వేస్తున్నారు.

కాగిన నూనే మళ్లీ వినియోగంలోకి..

ఒకసారి వినియోగించిన నూనెను వంటకాల్లో పదే పదే వినియోగిస్తుండడంతో జనం క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రోడ్డు పక్కన తోపుడు బండ్లు, బేకరీలు, రెస్టారెంట్లలో సైతం ఇదే జరుగుతుంది. అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పట్టించుకోని.. ఫుడ్ సేఫ్టీ

హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార పదార్థాలు వినియోగించకుండా చర్యలు చేపట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వీరి అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సంఘటనలు జరిగినప్పుడు ఎవరైనా ఫిర్యాదు చేస్తేగాని సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టడం గమనార్హం.

క్యాన్సర్ సోకే ప్రమాదం..



కాగిన నూనెను వంటకాల్లో వాడితే అల్సర్ వస్తుంది. ఎక్కువ రోజులు ఉడికించిన ఆహార పదార్థాలను తీసుకోవడంతో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. పెద్ద పేగు, చిన్న పేగులు దెబ్బతినే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ క్రాంతి కుమార్, ఎండీ

యజమానులకు నోటీసులు అందజేస్తాం



వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా హోటళ్లు, రెస్టారెంట్లకు నోటీసులు జారీ చేస్తాం. పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపడతాం. తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నాం. పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

– నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపాలిటీ, ఆదిలాబాద్

ఆస్పత్రుల తనిఖీ



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులను మంగళవారం తనిఖీ చేశారు. 'సాక్షి'లో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు మమతా మెటర్నిటీ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. పీసీపీఎన్‌డీటీకి సంబంధించి పోస్టర్లు అతికించలేదని, ఫామ్–ఎఫ్ ఉపయోగించడం లేదని, ఆస్పత్రిలో ధరల పట్టిక లేదని అధికారులు తెలిపారు. బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ అనుమతి ఉన్నప్పటికీ డస్ట్‌బిన్‌లు వాడటం లేదని పేర్కొన్నారు. ల్యాబ్‌లో కూడా ధరల పట్టిక లేదని తెలిపారు. అలాగే జన్‌సేన్ ఆస్పత్రిని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆస్పత్రులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. తనిఖీలు చేసిన వారిలో వైద్యాధికారులు అశోక్, మాస్ మీడియా అధికారి వెంకట్ రెడ్డి, సిబ్బంది కిరణ్, రాములు ఉన్నారు.

న్యాయం చేయాలని వినతి



ఆర్డీవోకు వినతి సమర్పిస్తున్న గ్రామస్తులు

బజార్‌హత్నూర్: తమకు న్యాయం చేయాలంటూ మండలంలోని ముంపు గ్రామమైన దేగామవాసులు ఆర్డీవో వినోద్‌కుమార్‌ను మంగళవారం ఆదిలాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004లో దేగామ గ్రామం బజార్‌హత్నూర్ సాగునీటి ప్రాజెక్టులో భాగంగా ముంపునకు గురైందని తెలిపారు. అయితే సగం గ్రామాన్ని మాత్రమే ఎగువ ప్రాంతానికి తరలించి పరిహారం అందించారని పేర్కొన్నారు. మిగతా సగం గ్రామం వరదల సమయంలో ముంపునకు గురవుతుందని తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఈనెల 13న లోకసభ ఎన్నికలను బహిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఫోన్ చేసి హామీ ఇవ్వడంతో తిరిగి ఓటేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెవెన్యూ రికార్డులకు గ్రామకంఠం కాపీ జతచేసి ఆర్డీవోకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఇందులో శేఖర్, సుదర్శన్, సుధాం, శరత్, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీ, సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. పోలీస్ భద్రత, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. భద్రత సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లుగా వెల్లడించారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్, బోథ్ కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కేంద్రాలను పరిశీలించిన ఆయన అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈసీ ఆదేశాల మేరకు కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బంది, బరిలో నిలిచిన అభ్యర్థులు, ఏజెంట్లు, ఇతర సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేపట్టాలన్నారు.ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్స్ వంటి సదుపాయాలతో పాటు మీడియా పాయింట్, సైన్ బోర్డ్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్లు శ్రీనివాస్, దిలీప్‌కుమార్, శ్యాంసుందర్ ఉన్నారు.

హడావుడికే పరిమితం!

- రిమ్స్‌లో ఆరోపణలపై విచారణలు నామమాత్రం
- ఘటనలు జరిగినప్పుడే సద్దుమణిగేలా కమిటీలు
- రోజులు గడిచినా వెల్లడికాని నివేదికలు



రిమ్స్ ఆస్పత్రి

సాక్షి,ఆదిలాబాద్: ఆదివాసీ అమాయక గిరిజనులు అత్యధికంగా నివసించే ఆదిలాబాద్ వంటి ప్రాంతంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందడంతో పాటు ఆరోగ్య ప్రమాణాలు పెంపొందించేందుకు సర్కారు వైద్య కళాశాల రిమ్స్ ఏర్పాటైంది. అయితే అది ఆ లక్ష్యాలను అందుకోగలుగుతుందా అంటే లేదనే చెప్పాలి. ఈ ఆస్పత్రిలో జవాబుదారితనం కొరవడిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా వైద్యసేవల పరంగా ఆరోపణలు వచ్చినప్పుడు, సేవలందించే విషయంలో విమర్శలు వ్యక్తమైనప్పుడు దానిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. అయితే ఈ విషయంలో నిండా నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. ఈనేపథ్యంలో ఇలాంటి సంఘటనలపై దృష్టి సారించాలనే అభిప్రాయం సామాన్య జనం నుంచి వ్యక్తమవుతుంది.

ఇదీ పరిస్థితి..

గర్భకోశ సంబంధిత సమస్యతో ఉట్నూర్ మండలం శ్యాంపూర్ లక్సెట్టిపేట సమీపంలోని చిన్నగూడకు చెందిన ఆత్రం లక్ష్మిబాయి(55) బాధపడుతూ ఏప్రిల్ 30న రిమ్స్ ఆస్పత్రికి చికిత్స కోసం రాగా, ఆమెను చేర్చుకునేందుకే సిబ్బంది నిరాకరించారు. రాత్రి 11నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు సుమారు ఐదున్నర గంటల పాటు ఆమె స్ట్రెచర్‌పైనే ఉంది. అక్కడ చికిత్స అందించే పరిస్థితులు వారి కుటుంబ సభ్యులకు కనిపించకపోవడంతో ఆ మహిళను తిరిగి గ్రామానికి తీసుకెళ్లగా మే 1న ఆమె మృతి చెందింది. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయంలో ముగ్గురు ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేస్తామని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. ఇప్పటివరకు విచారణపై అతిగతి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ సేవలు ఎలా మెరుగవుతాయనేది ఆలోచించదగ్గ విషయమే. అలాగే ఆస్పత్రిలో పేషెంట్‌కేర్ సిబ్బంది అయిన ఓ మహిళ ఈనెల 15న ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం కలిగించింది. దీనిపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీతో విచారణ చేయిస్తామని డైరెక్టర్ స్పష్టం చేసినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. ఈ పరిస్థితుల్లో రిమ్స్‌లో సేవలు అందించే సిబ్బందికి మనోధైర్యం ఎలా ఇవ్వగలుగుతారనేది ప్రశ్నార్థకమే.



మే 2న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



మే 16న ప్రచురితమైన కథనం

కలెక్టర్ దృష్టి సారించాలనే అభిప్రాయం..

రిమ్స్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో రిమ్స్‌లో జరిగే ఘటనలకు సంబంధించి విచారణపై నివేదిక రూపొందించే విషయంలో పూర్తిస్థాయిలో దృష్టి సారించాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రస్తుతం విచారణకు కమిటీలు నియమించడం.. వారు ఆ విచారణ చేపడుతున్నారో లేదో.. ఆ తర్వాత ఎవరికీ తెలియని పరిస్థితి. దానిపై నివేదిక తయారు చేసి ఎవరికి పంపిస్తున్నారు.. దాని ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. ఇలాంటివేవి బయటకు రావడం లేదు. ఈ నేపథ్యంలో రిమ్స్‌లో జవాబుదారి తనం పెంచేలా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం సామాన్య జనం నుంచి వ్యక్తమవుతుంది.

ఈ విషయంపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను వివరణ కోరగా, ఆదివాసీ గిరిజన మహిళకు సంబంధించి విచారణ తుది దశకు వచ్చిందని తెలిపారు. అలాగే పేషెంట్‌కేర్‌కు సంబంధించి కమిటీ విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

కైలాస్‌నగర్: మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. అలాగే ప్రధానిగా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, దిగంబర్‌రావు, సంతోష్, ప్రవీణ్ రెడ్డి, శ్రీలేఖ, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పలు వార్డుల్లో ప్రత్యేక అధికారి పర్యటన

కైలాస్‌నగర్: పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్, మహాలక్ష్మివాడ, క్రాంతినగర్ కాలనీల్లో ఆదిలాబాద్ అర్బన్ మండల తాగునీటి పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం పర్యటించారు. ఆయా కాలనీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా తీరుపై ఆరా తీశారు. కాలనీవాసులతో మాట్లాడి నీటి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, బల్దియా ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

ఇంటి సామగ్రి దగ్ధం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

కుంటాల: మండలంలోని అందాకూర్‌లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టగా నిప్పురవ్వలు ఎగిసిపడి రాజారపు ఎర్రన్నకు చెందిన పాకలో పడడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. కాగా అప్పటికే పాకలో నిల్వచేసిన పాత ఇంటి సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

'సాధారణ బోగీల సంఖ్య పెంచాలి'


కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

ఆదిలాబాద్: దేశంలోని ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్య ఐదుకు పెంచాలని సాధారణ భోగిల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్తంగా ప్రధానికి కోటి ఉత్తరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కొన్నికోట్ల మంది ప్రజలు రైలు ద్వారా ప్రయాణించడం జరుగుతుందన్నారు. చవకైన రైలు ప్రయాణాల ద్వారా ఎంతో మంది సామాన్యులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే నిరుపేదల సమస్యలను, జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రతి రైలులో ఐదు సాధారణ భోగిలను అదనంగా ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రికి విన్నవించుకోవడం జరుగుతుందన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు


సాయి చైతన్య(ఫైల్)

సారంగపూర్: మండల కేంద్రానికి చెందిన సాయి చైతన్య (35) ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో ఆరాతీసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని సోదరి ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడిచేసిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన శ్రీకాంత్, అరుణ్, సతీష్‌పై దాడి చేసిన రవితేజ, చెప్పు అనే వ్యక్తులపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న క్రాంతినగర్ రోడ్డుపై అడ్డంగా రవితేజ, చెప్పు అనే ఇద్దరు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఆ రోడ్డు గుండా వెళ్తున్న శ్రీకాంత్, అరుణ్ వాహనం వారికి తాకగా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. వీరితో పాటు మరో వ్యక్తి సతీష్‌పై కూడా దాడికి దిగారు. శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గంజాయి స్వాధీనం

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామంలో పంట చేనులో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఉర్వత జలీంషా పంట పొలంలో తనిఖీ చేయగా 500 గ్రాముల (రూ.12వేలు) గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


పెర్సపేన్‌కు పూజలు చేస్తున్న ఆత్రం వంశ మహిళలు


దేవుడిపై వేస్తున్న పవిత్ర నీటిని సేకరిస్తున్న మహిళలు


ప్యాలాలు, పుట్నాలు, కానులు వేసి మొక్కులు చెల్లిస్తున్న ఆత్రం వంశ మహిళలు

గిరి గ్రామాల్లో పెర్సపేన్ పూజలు

ఇంద్రవెల్లి: వైశాఖమాసం పురస్కరించుకుని మండల పరిధిలోని గిరి గ్రామాల్లో ఆదివాసీలు మంగళవారం పెర్సపేన్ (పెద్ద దేవుడు) పూజలు ఘనంగా నిర్వహించారు. వడగామ్‌లో కోర్‌కార్ ఆత్రం వంశీయులు సంప్రదాయబద్ధంగా వాయిద్యాలు వాయిస్తూ పెర్సపేన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కటోడ(పూజారి) ఇంట్లో సంప్రదాయ పూజలు చేశారు. ప్యాలాలు, పుట్నాలు, కానుకలు వేసి మొక్కులు సమర్పించారు. అనంతరం గ్రామ సమీపంలోని పవిత్రమైన మడుగులో స్నానం ఆచరించారు. రాత్రి మహాపూజ అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి కోర్‌కార్ ఆత్రం వంశీయులు తరలివచ్చారు.

వసతిగృహాల్లో మరమ్మతులెప్పుడో?


ఈ ఫొటోలో కనిపిస్తున్నది గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల వంటగదిలో ఫ్లోరింగ్ పగిలిపోయి ఉన్న దృశ్యం. అలాగే విద్యార్థులు నివాసం ఉండే డార్మెంటరీ ఫ్లోరింగ్ పగిలిపోయి సమస్యలు స్వాగతం పలుకుతున్న దృశ్యాలు.


ఇక్కడ కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని బాలుర గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల దాహార్తి తీర్చే నీటి కుళాయిలు. వందలాది మంది విద్యార్థులకు గానూ ప్రస్తుతం రెండు మాత్రమే పని చేస్తున్నాయి. విద్యాసంస్థల పునఃప్రారంభంలోగా మిగతా వాటిని బిగించాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతు చేపట్టలేదు.

- నివేదికలు ప్రతిపాదనలకే పరిమితం
- జూన్‌లో విద్యాసంస్థలు ప్రారంభం
- సమస్యలకు స్వాగతం
- ఎన్నికల కోడ్ అమలు కారణంగా పనుల్లో జాప్యమంటున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల పరిధిలో పలు వసతిగృహాలు కొనసాగుతుండగా ఏటా వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గత నెలలో వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. ఆయా వసతిగృహాల్లోని మరుగుదొడ్లు, స్నానపు గదులు, పైపులైన్లు, తలుపులు, కిటికీలు, తదితర మరమ్మతు పనులను సంబంధించిన ప్రతిపాదనలను వేసవి సెలవుల్లో ప్రభుత్వానికి నివేదిస్తారు. ఈ ఏడాది ప్రతిపాదనలు పంపించినా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. జూన్‌లో విద్యాసంస్థలు ప్రారంభం కానుండగా మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

జిల్లాలో ఐటీడీఏ ద్వారా 133 వసతి, రెసిడెన్షియల్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఆయా వసతి గృహాల్లో వివిధ మరమ్మతుల కోసం రూ.16 కోట్ల నిధులు అవసరం ఉందని సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో జిల్లాలో 14 ప్రీ, పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో 7 వసతి గృహాల్లో మరమ్మతు చేసేందుకు సాంఘిక సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు కొలతలు సేకరించారు. వాటికి రూ. 87.70 లక్షలు అవసరముంటుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. దళిత అభివృద్ధిశాఖ పరిధిలో 18 ప్రీమెట్రిక్, 3 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వాటిలో రెండేళ్ల కిందట రూ.1.20 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈసారి తాత్కాలిక మరమ్మతు ఉంటే ఆయా వసతి గృహాలకు సంబంధించిన హెచ్‌డబ్ల్యూవోలు తమ దృష్టికి తీసుకువస్తే నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సకాలంలో ప్రారంభించకుంటే అంతే?

జిల్లాలోని ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న వసతి గృహాలలో వివిధ రకాల మరమ్మతుల పనులు సకాలంలో ప్రారంభించకపోతే పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం రోజే సమస్యలతో స్వాగతం పలకనున్నాయి. అలాగే పనుల్లో సైతం నాణ్యత లోపించే అవకాశం ఉంటుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వసతి గృహాలలో మరమ్మతుల విషయంపై 'సాక్షి' ఆయా శాఖల అధికారులను సంప్రదించగా పాఠశాలలు పునః ప్రారంభంలోగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని, ఎన్నికల కోడ్ అమలు కారణంగా నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి వీసీ ఇంకెన్నాళ్లు..!?

- 'బాసర'కు రెగ్యులర్ వీసీని ఇవ్వరా..
- ట్రిపుల్‌ఐటీ సమస్యలు పట్టించుకోరా..
- ఇప్పటికీ విడుదలకు నోచుకోని నోటిఫికేషన్
- వర్సిటీపై ప్రభుత్వానికి పట్టింపు కరువు..!



భైంసా: చదువులతల్లి కొలువైన బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రంతో పాటు ఇక్కడే ఉన్న ట్రిపుల్‌ఐటీ విద్యాక్షేత్రంపైనా ప్రభుత్వం చిన్నచూపు చూస్తూనే ఉంది. బాసర ఆర్జీయూకేటీ 2024–25 విద్యాసంవత్సరం నోటిఫికేషన్ కూడా ఇప్పటికీ విడుదల కాలేదు. ఏళ్లు గడుస్తున్నా.. ఇక్కడ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. రాష్ట్రంలోని ఏకైక ట్రిపుల్ ఐటీగా ఉన్నా పట్టించుకునే వారే లేరు. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తున్నా.. ఐఏఎస్‌లను ఇన్‌చార్జీలుగా పెడుతున్నా.. బాసర వర్సిటీని మాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా బాసర క్యాంపస్‌లో మార్పు రావడం లేదు. ట్రిపుల్‌ఐటీ ప్రారంభం నుంచి ఇప్పటివరకు విద్యార్థులు దశలవారీగా పోరాటాలు చేస్తున్నా సమస్యలు పరిష్కరించే సరైన అధికారి కనిపించడం లేదు. ఇప్పటికైనా రెగ్యులర్ వీసీని ఇస్తారా? లేదా? అన్న అనుమానాలే కొనసాగుతున్నాయి.

చిన్నచూపు ఎందుకు?

పేదింటి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దే విద్యాక్షేత్రంపై చిన్నచూపు కొనసాగుతోంది. దాదాపు తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉండే వర్సిటీకి రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీ ఉన్నా ఆయన వర్సిటీలో ఉండకపోవడం దారుణం. ఏదైనా ఘటన జరిగినప్పుడు.. క్యాంపస్‌లో కార్యక్రమం ఉన్నప్పుడే వచ్చివెళ్తున్నారు. స్థానికంగా ఉండే డైరెక్టర్‌ను కూడా తాజాగా మాతృసంస్థకు పంపించారు. దీంతో ట్రిపుల్ ఐటీ పరిస్థితి 'అందరూ ఉనా అనాథ'లా మారింది. వర్సిటీలో బాధ్యతలను డీన్‌లకే అప్పగించి చేతులు దులుపుకొనే పరిస్థితి కనిపిస్తోంది. పాత ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆర్జీయూకేటీని పట్టించుకోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఉద్యోగ భద్రత లేకపోవడంతో...

ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివిన వాళ్లు, మంచి మెరిట్ ఉన్న విషయ నిపుణులతో బాసర ట్రిపుల్ ఐటీ కళకళలాడేది. అలాంటి విద్యావంతుల బోధనతో వేలమంది విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదిగారు. క్రమంగా తమ ఉద్యోగ భద్రత అగమ్యగోచరంగా మారడంతో సదరు అధ్యాపకులు ఇతర ఉద్యోగాల వైపు వెళ్లిపోతున్నారు. దాదాపు తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉండే వర్సిటీలో కనీసం 350 మంది వరకు అధ్యాపకులు ఉండాలి. కానీ 125 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో రెగ్యులర్ వాళ్లు 20 మంది వరకే ఉండడం గమనార్హం.

ఇన్‌చార్జి వీసీలతోనే..

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ఆర్జీయూకేటీకి చాలా తేడా ఉంది. చుట్టూ ప్రహరీతో పూర్తిగా రెసిడెన్షియల్ క్యాంపస్‌గా ఉండే ఈ సువిశాల ప్రాంగణంలో దాదాపు వేలమంది విద్యార్థులుంటారు. ఇంతపెద్ద విద్యాసంస్థలో అప్పుడప్పుడు ఏదో ఒక ఘటన జరగడం సహజమే. కానీ తరచూ విద్యార్థుల ఆత్మహత్యలు, వారికి పెట్టే భోజనంతో సహా యూనిఫాం, ల్యాప్‌టాప్స్, షూస్.. ఇలా ఎన్నో వాటిలో సమస్యలు వస్తూనే ఉన్నాయి. స్థానికంగా పర్యవేక్షిస్తూ.. ప్రభుత్వంతో అనుసంధానిస్తూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించగలిగే వాళ్లు ఇక్కడ అత్యవసరం. గతంలోనూ ఇన్‌చార్జి వీసీల పాలన కారణంగానే విద్యార్థులు ఉద్యమం చేపట్టే దాకా వెళ్లింది. అప్పుడు ఎన్నో హామీలిచ్చిన ప్రభుత్వం మళ్లీ పాత తప్పే చేసింది. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఉన్న వెంకటరమణకు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలిచ్చి చేతులు దులుపుకుంది. ఇప్పుడు ఆయన కూడా స్థానికంగా ఉండటం లేదు. తనకు ఇదొక అదనపు బాధ్యత మాత్రమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అరకొర పట్టింపుతోనే ఆర్జీయూకేటీ జాతీయ స్థాయి అవార్డులు సాధిస్తోంది. ఇక పూర్తిస్థాయి వీసీని, సరిపడా అధ్యాపకులను నియమించి సమస్యలు లేని వర్సిటీని చేస్తే అంతర్జాతీయంగా పేరు తీసుకువస్తామని ఇక్కడి విద్యార్థిలోకం చెబుతోంది.

సీఎం హామీ ఇచ్చారు..

బాసర సరస్వతీ మాత చెంత ఉన్న ట్రిపుల్ ఐటీని ఎలాంటి సమస్యలు లేకుండా కొనసాగించాలన్నది మా ప్రయత్నం. అందులో భాగంగానే ఇక్కడ ఇన్‌చార్జి వీసీని తొలగించి రెగ్యులర్ వీసీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరాం. వర్సిటీలకు సంబంధించి కమిటీ వేశామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

– పవార్ రామారావు పటేల్, ఎమ్మెల్యే, ముథోల్

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


పవార్ కృష్ణ (ఫైల్)

జైనథ్: మండలంలోని భోరజ్ సమీపంలో సోమవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు వెనుకనుంచి ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిరాల గ్రామానికి చెందిన భోయర్ జగదీష్ పక్కింట్లోని ఛాయాబాయి, లక్ష్మణ్ దంపతుల కుమారుడు పవార్ కృష్ణ (11)తో కలిసి కారులో ఆదిలాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా భోరజ్-బేల జాతీయ రహదారిపై ఎరువుల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనక నుంచి ఢీకొన్నాడు. కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఘటనలో జగదీష్, కృష్ణకు తీవ్రగాయాలు కావడంతో 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మంగళవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జగదీశ్ పరిస్థితి సైతం ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుని తల్లి ఛాయాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రౌతు విక్కి ఈ నెల 19న రాత్రి తన ఇంటి ముందు ఆటోను పార్కింగ్ చేసి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికి ఆటో కనిపించకుండా పోయింది. దీంతో ఆయన చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

నీలగిరి తోట దగ్ధం


దగ్ధమవుతున్న నీలగిరి చెట్లు

లోకేశ్వరం: మండలంలోని బిలోలిలోని సాయినేని సౌజన్య అనే మహిళా రైతుకు చెందిన నీలగిరి తోటకు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. బాధిత మహిళ తనకున్న 22 ఎకరాల్లో కొన్నేళ్ల క్రితం నీ లగిరి చెట్లను నాటింది. మంగళవారం సాయంత్రం చెట్లకు నిప్పంటుకోవడంతో పదెకరాల్లో చెట్లు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం నష్టపరిహా రం అందించాలని బాధితురాలు కోరుతోంది.

ఆర్టీసీ బస్సులో చైన్ స్నాచింగ్

జైనథ్: 44వ నంబరు జాతీయ రహదారిపై గల మాండగాడ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులో పన్నాల భారతి అనే మహిళ మెడలోంచి 3 తులాల గొలుసు చోరీకి యత్నించిన మండలంలోని పిప్పర్‌వాడకు చెందిన డిడాకర్ శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పన్నాల భారతి మహారాష్ట్రలోని చిన అర్లి గ్రామానికి వెళ్లి సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సులో తిరుగు ప్రయాణం అయ్యింది. మండలంలోని మాండగాడ బస్ స్టాప్ వద్ద బస్సు ఆగడంతో ఆమె వెనక ఉన్న శ్యాంసుందర్ మెడలోంచి మంగళ సూత్రం లాక్కొని పరిగెత్తాడు. గమనించిన తోటి ప్రయాణికులు, స్థానికులు అతన్ని పోలీసులకు అప్పగించారు. చైన్‌ను స్వాధీనం చేసుకొని మంగళవారం కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

సారూ.. మమ్మల్ని అన్యాయం చేయకండి

- దిలావర్‌పూర్‌లో ఇళ్లులేని నిరుపేదల ఆక్రందన


మాట్లాడుతున్న తహసీల్దార్ స్వాతి, సీఐ

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లో ఐదేళ్లక్రితం నూతన టెక్నాలజీతో 30 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మాణం చేపట్టారు. మూడేళ్లు కావస్తున్నా అర్హులైన నిరుపేదలకు ఇవ్వకపోవడంతో 15 రోజుల క్రితం గ్రామంలోని ఇండ్లులేని నిరుపేదలు వాటిని ఆక్రమించి నివాసం ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసుల అధికారులు వారిని అందులో నుండి ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఆందోళన నెలకొనడంతో తహసీల్దార్ స్వాతి, నిర్మల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన వారిని త్వరలోనే గుర్తించి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ఇండ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. అనంతరం పంచాయతీ రాజ్ ఇంజనీర్ శివకుమార్ అన్ని రూంలను సీజ్ చేశారు.

ఆదర్శం భీంపూర్ ఎంపీపీ


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ

తాంసి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతుండటంతో ప్రజా ప్రతినిధులు సైతం ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మంగళవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఎంపీపీ కుడ్మెత రత్నప్రభ సైతం తోటి మహిళలతో కలిసి వచ్చి ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిమ గిరిజన తెగలకు చెందిన కొలాం, తోటి, కొలావర్ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ ప్రతిభ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసినవారు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల లో ప్రవేశం పొందవచ్చన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకోలి, అనుకుంట గ్రామాల్లోని విత్తన షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, విత్తన ప్యాకెట్‌లపై ఉన్న లాట్ నంబర్, షాప్ డోర్ నంబర్, బిల్ బుక్, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన షాపులలో అందుబాటులో ఏఏ విత్తనాలు, ఎన్ని అందుబాటులో ఉన్నాయో స్టాక్ బోర్డుపై రాయాలన్నారు. మండలంలోని రైతులు విత్తనాల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కావాల్సిన విత్తనాలన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల వద్దనే విత్తనాలు తీసుకోవాలన్నారు. విత్తనాలు తీసుకునేటప్పుడు బిల్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి అష్రఫ్, ఏఎస్సై సునీత, తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో అన్నదమ్ముల అరెస్ట్



నిందితులతో సీఐ సాయినాథ్, ఎస్సై

జైనథ్: గంజాయి కేసులో మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన అన్నదమ్ములు సోర్తె రుపేష్ బాబు, సోర్తే ప్రవీణ్ బాబులను అరెస్ట్ చేసినట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జైనథ్, లక్ష్మీపూర్ ఎక్స్‌రోడ్ సమీపంలో ఎస్సై పురుషోత్తం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూపేష్ బాబు, ప్రవీణ్ బాబు పల్సర్ బైక్‌పై గంజాయిని ఆదిలాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 140 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. అన్నదమ్ములిద్దరూ కొంత కాలంగా తమ చేన్లో పత్తి పంటలో గంజాయిని అంతర పంట సాగు చేసున్నట్లు వెల్లడించారు.

కమిషనర్ తీరును నిరసిస్తూ కౌన్సిలర్ రాజీనామా


రాజీనామా పత్రం అందజేస్తున్న కౌన్సిలర్

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డుపై జరుగుతు న్న ఆక్రమణలను మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఆరో వార్డు కౌన్సి లర్ ఆఫ్రినాబేగం తన పదవికి రాజీనామా చే స్తున్నట్లు ప్రకటించారు. పట్టణంలోని మున్సి పల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యం స మక్షంలో కమిషనర్ మనోహర్‌కు రాజీనామా పత్రం అందజేశారు. పట్టణంలో జరుగుతున్న ఆక్రమణలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా క మిషనర్ క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని తెలిపారు. బీజేపీ నాయకులతో తనకు వివాదం సృష్టించా లని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రో డ్డు పై పెరుగుతున్న ఆక్రమణలను ఆపడంలో విఫ లమైన తీరును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తన రా జీనామా ఆమోదించాలని కోరతానని తెలిపారు.